మోసం చేసిందా?

హనుమంతరావు జాడ్యం ప్రణయతత్వమా, ప్రబంధ పారాయణా, విరహవర్ణనలూ, ప్రేయసీ స్మరణలతో ప్రారంభమై, చప్పున వారం రోజులకింద వేదాంతచర్చా, విరక్తి ఉపన్యాసాలూ, సీతారామాంజనేయ పఠనమూ, స్త్రీ ద్వేషములోకి దిగింది. భర్తృహరిశృంగార శతకం ఆఖరు పేజీతిప్పి, వైరాగ్య శతకం ప్రారంభించి నట్లయింది. వాడి వాగుడంతా వినేగతి పట్టిన నేను, పది పదిహేనురోజులు శాంతంగా భరించి, చికిత్సలు ప్రయత్నించాను కాని యీ జాడ్యపు అసలు కారణం కనిపెడితేగాని స్వస్థత కలగదని, అతను ఆ జాడ్యంలోనూ, అంతకుముందూ చేస్తున్న ప్రదక్షిణాలవల్ల కారణం విష్ణాలయం ప్రాకారసామీప్యంలో వుండాలనుకుని వెతికాను. అతనిని వొదిలిన శృంగారజాడ్యం అక్కడ నన్నావరించింది.

ఈ శరీరం అసహ్యపు మాంసమనీ, దీన్ని జాగ్రత్తగా అలంకరించడమంత పరిహాసాస్పదమైన పని లేదని, యెన్నడో కట్టెలలో కాల్చేదేననీ పాడుతున్న హనుమంతరావు ఉత్సాహ వాక్యాలను వీలైనంత వరకు పెడచెవిని బెట్టి షోకు చేసుకుని, విష్ణాలయంవేపు వెళ్ళాను. సంజ మసకలో తెల్లగన్నేరు మొక్కలకిందికి లలిత వొచ్చింది. నాలుగు రోజుల్లో యెవరితోనో నాకింత స్నేహం కాలేదు. మొదటి రోజునే నాతో—

"నన్నొక్క సందేహం బాధిస్తోంది. మీరు మీ విజ్ఞాన విశేషం వల్లా, విద్యాధిక్యతవల్లా తీర్చగలరని నా ఆశ. మీ కీర్తి మీ పుస్తకాల వల్లా, కొందరు స్నేహితులవల్లా, విన్నాను" అంది.

ఆ స్నేహితులలో ఒకడు హనుమంతరావు కాదు గదా అని సందేహం కలిగి, "అతన్నెరుగుదువా" అని అడిగాను లలితని. చాలా నాజూకుగా తలవంచుకొని, "నాకు బాగా తెలీదు నా అక్కయ్య నెరుగు నాయనా," అంది. నా గుండె నిబ్బరంపడి, రాత్రికి వాడిగొంతు పిసకడమా? కత్తితో నరకడమా? ఏది సులభమనే ఆలోచనను ఆపుకున్నాను. ముసలి భర్తను వొదలిరావడమా? ఏమిటామె సందేహమని ఆలోచించాను. కాని ఆమె నా దగ్గిర్నించి సందేహం తీర్చుకునే పద్ధతి చాలా మనోహరంగా వుండడంవల్ల దాన్ని తీర్చడానికి నే నేమీ తొందర పళ్ళేదు. దేవాలయ పుణ్యక్షేత్రంలో, లక్ష్మీదేవి సాన్నిధ్యమందు, తెల్ల గన్నేరు వాసనలలో నానిన నూనె ప్రమిదలూ వాడిన తులసీ దళాలు కలిసి పంపే సుగంధంలో లేతరాత్రి చిన్ని చీకట్లలో దొరికిన ఈ శృంగారం నాకెంతో వుల్లాసాన్నీ మాధుర్యాన్నీ యిచ్చింది. ఈ స్నేహానికి పర్యవసానమేమిటి? ఈమె యెవరు? ఎందుకిట్లా వొస్తుందని యోచిస్తే ఆ కల యెక్కడ మాయమౌతుందోనని భయంతో ఆనందంలో కళ్ళు మూసుకుని మునిగిపోయినాను. హనుమంతరావు వేదాంత శ్రవణం ప్రారంభించగానే గదిలోనించి పరిగెత్తేవాణ్ణి. ఆరురోజులయింది; లలిత పరిచయం పెదిమల దగ్గరే ఆగింది. ఎందుకు? ఆటంక మేమిటో తెలీదు.

"లలితా! నిన్నువొదిలి వెళ్ళినా రోజల్లా నువ్వే తలపుకు వస్తావు. స్కూల్లోవున్నా తటాలున నీ రూపం జ్ఞాపకమొచ్చి పిచ్చెక్కుతుంది. నీ ముఖం పోలిక పుస్తకంలో గీస్తోవుంటే మా లెక్చరర్ చూశాడు. నా హృదయాన్ని లాగేసి, ఈ చెరుగులో దాచేసుకున్నావు. నీ హృదయానికి దగ్గిరగా! నావల్ల నేరమేమిటో చెప్పు. ఎందుకట్లా కళ్ళు కిందికివాల్చి,

జవాబు చెప్పక హృదయంలో యేదో రహస్యమైన బాధవున్నట్లు తోపిస్తావు? నేను నీ వాణ్ణే. నన్నిట్లా తోసేస్తా వెందుకు?"

నిదానంగా వాల్చివున్న ఆ ముఖంవంక చూశాను. ముక్కుదగ్గర నించీ చంపలమీద పొడుగ్గా కణతలవరకు పరుచుకొని వున్న కనుబొమ్మలని చేత్తోతాకి చెంపమీద మెల్లిగా కొట్టాను.

"నా సందేహమే అది. మిమ్మల్ని ఆ రోజునేఅడగాలనుకున్నాను. చూడండి, పాపం కదండీ! పెళ్ళికాని వాళ్ళతో సహవాసం? పోనీ, యిట్లా కూచుంటే తప్పేముంది కాని....అసలు భార్యగా వుండడం పాపంకదూ! ఈ కాస్త సుఖానికి వెయ్యేళ్ళు నరకంలో అగ్నిగుండంలో కాలడం!"

ఇంతేనా యీ సందేహం అనుకున్నాను. కాని లలిత మనసులో ఈ వూహ బాధిస్తున్నట్లూ, ఈ ఆలోచనే ఆమెని ఆటంక పరుస్తున్నట్లూ, తట్టింది. కాని ఇంత గాఢంగా ఆలోచించడానికి వ్యవధాన మెక్కడిది? వయసులోవున్నపిల్ల తన వాంఛనీ, ధర్మాన్నీ విడదీసి యోచించ కలిగినంత అవసర మెట్లాకలిగిందని ఆశ్చర్యం వేసింది నేనూ ఆలోచించ తలుచుకోలేదు. "లలితా! నన్నడగడం మంచిదయింది. ఈ విషయమై నేను దీర్ఘంగా ఆలోచించాను. నాకింతె ఎవరికీ ఎక్కువ తెలీదు. ఇంకెవరినన్నా అడిగితే నీకు తప్పుడు అభిప్రాయాలు చెప్పివుందురు."

నోరు సన్నగా చంద్రవంకలాగుచేసి చిరునవ్వుతో, వోరకంటితో నావంకచూస్తో—"మీపుస్తకాలు చదివాను. అంతమాత్రం మీ అపారజ్ఞానం, ఉత్తమ మేధాశక్తీ, కనిపెట్టలేక పోయినానంటారా? తరవాత మిమ్మల్ని దారుసార్లుచూసి, మీ పుస్తకంలో మీ 'ఫోటో' నించి పోల్చుకున్నాను."

నేను దేవేంద్ర సింహాసనాన్నధిష్టించి తై, లోకాధిపత్యం వెంటనే వహించాను. ఒక్క స్త్రీ హృదయంలో ఇంత వున్నతభక్తినీ, ప్రేమనూ వెలిగించిన నా కవిత్వతం, నా వంశం, నా జన్మం, నా పద్యాలు అచ్చువెయ్యమని 'భారతి'ని బతిమాలుకుంటో నేను రాశిన వుత్తరాలు అన్నీ విఫలమైనాయి.

"నీ మెత్తని మనసులో ఇట్లాంటి దుర్మార్గపు టూహలు యే రాక్షసులు కల్పించారు?"

"చిన్నప్పణ్ణించి మా యింటో పురాణాలు విన్నాను. అప్పణ్ణించి నాకీ భయం పట్టుకుంది. మీ పుస్తకాలు చదివి యెంత ప్రయత్నించినా మనసు కుదటపళ్లేదు."

"స్త్రీ పురుషవాంఛ సహజం. మృగాల్లో పుణ్య పాపాలుంటాయా? మనుష్యుల్లో పాపమని యెవరన్నారు? దేవుడొచ్చి చెప్పాడా? పుస్తకాల్లో రాశారు. ఎవరు? సంఘక్షేమం కోసమని కొందరు మహానుభావు లివి యేర్పరచి, పాపాలని పేరుపెట్టి మూఢుల్ని దగిపించారు. ప్రతివారూ లేచిపోయి సంఘం గోల అయిపోతుందేమోనని యిట్లాంటి నిబంధన లేర్ప రిచి, నరకమనే భయంతో మనుష్యుల స్వభావసిద్ధమైన వాంఛల్ని కట్టి వెయ్యాలని ప్రయత్నించారు."

"మరి యముడూ, చిత్రగుప్తుడూ వీళ్ళందరూనో?"

"యోచించు ఆ చిత్రగుప్తుడు నోటుపుస్తకం పట్టుకుని, ఇన్ని కోట్ల ప్రజల గదుల్లోనూ దూరి 'యెలక్ట్రిక్ టార్చి' వెలిగించి, ప్రతి జతకీ పెళ్ళి జరిగిందో లేదో సాక్ష్యాలు విచారించుకుంటో తిరుగుతాడా!"

"నిజం చెపుదురూ!"

"నిజమే"

"అయితే యింక నీతీ దేవుడూ యేమీలేవూ!"

"లేకేం? నీతంటే యేమిటి? అంతా మన మేర్పరచుకున్నదే! దేవుడున్నాడు. కాని యీ నీతులన్నీ యేర్పరచింది దేవుడుకాడు...."

ఈ ప్రకారం అరగంట మాట్లాడాను ప్రతివాక్యం గురు బోధవలె భక్తితో విని వెళ్ళేటప్పుడు నా విద్వత్తును ఒక ముద్దుతో సత్కరించింది.

మర్నాడు నా పుస్తకాలమీద "నా హృదయేశ్వరికి" అని రాసి, ఆమెకి సమర్పించాను. ఆ సాయంత్రమంతా హిందూ మతంమీదా, ముక్కోటి దేవతలమీదా, త్రిమూర్తులమీదా ఉపన్యాసమిచ్చి, దేవుడు వొక్కడే అనిన్నీ, ప్రపంచం చాలా విశాలమయిందనిన్నీ, క్షుద్రులమైన మన చిన్న కార్యాల నీతి అవినీతులు కనిపెట్టడంకన్న యీశ్వరుడికి చాలా పనులున్నాయనిన్నీ రూఢిపరచాను. నీతి అనగా మనసులో ప్రేమించిన వాడికి సర్వమూ అర్పించడమేనని బోధించాను. ఆ మాటలకోసమే తనెదురు చూస్తున్నట్లు అతిశ్రద్ధతో వింది.

"పోనీ, యీపనులకి అంత ప్రాముఖ్యం లేనప్పుడు అనేకమందికి—యిద్దరిముగ్గురికి—సంతోషమిస్తే నేమండీ?"

నా హృదయం ఝగ్గుమంది. "అట్లాకూడదు. ఎవరిని ప్రేమించావో వారినితప్ప యితర్లని తాకడం మహాపాపం."

"పాపం లేదన్నారు!"

"అదే, నరకపాపంకాదు—మన అంతరాత్మలకి."

"అంటే అంతరాత్మలకైనా పాపమూ పుణ్యమూ వున్నాయన్న మాట."

చర్చ చాలా యిబ్బందిగా దిగింది. చీకటయింది. ఇంకా యెన్నాళ్ళు? ఈ సౌందర్యం నాపక్కన కూచుని నను దూరాన్నుంచి యేడిపిస్తోంది. ఇంటికి వెడితే ఇట్లా మాట్లాడి, అట్లాచేసి, లోపరుచుకోక మూర్ఖుణ్ణయి కాలమంతా యెందుకు వ్యర్థం చేశానా అని బాధపడి, ఎంతో నిశ్చయపరుచుకొని యెంత ప్రయత్నించినా నన్ను చమత్కారంగా తప్పించుకుంటోంది.

"అదంతా రేపు ఆలోచిద్దాములే, నీమీద ప్రేమతో కాలిపోతో వుంటే, నన్నెందుకింత నిర్దయగా........"

"ఉండండి. మరి ముందు నే చెప్పేమాట వినండి. నిన్నటినించి నా మనసులో మీ మాటలే ఆలోచిస్తున్నాను. మీరు యెంతబాగా విడదీసి చెప్పారండీ! నాకీ బాధ యెందుకు వచ్చిందంటే ...రేపు తెలియచేస్తాను లెండి. రేపే మీ సలహా ఆచరణలో పెడతాను. ఈయింటో నాబతుకు చాలా కష్టంగావుంది. నా మనసు యెన్నడో ఒక అద్భుతవ్యక్తికి సమర్పిత మయింది. (నా వంక అతి నాజూకుగా చూసింది.)

ఎవరంటారా? మీకేతెలుసు? తెలీకపోతే రేపు చెపుతాను. ఈవేళ పొద్దుపోయింది. మీకు అతను బాగాతెలుసు—మీ అంతబాగానూ.

(నా వొళ్ళుపొంగింది. చమత్కారం మనిషి!) "....ఉండండి.... వొదలండ.... యీ యింటోనుంచి వొచ్చేస్తేనే గాని నాకేమీ తోచదు."

నానుంచి తప్పించుకుని మామూలు ముద్దన్నా యివ్వకుండా వెళ్ళిపోయింది.

దోవలో ఒకటే ఆలోచన, నా స్వర్గసౌఖ్యాన్ని గురించి. రేపు సాయింత్రం ఈ అమ్మాయిని యెక్కడికి లేవతీసుకుని వెళ్ళను! ఇన్ని పద్యాలురాసి, యింతబోధించి వెనక్కి తగ్గానా? నా చదువేమైతేనేం, అమ్మాయి యేమైతేనేం? ప్రేమయెదట అన్నీ తొలగిపోవలసిందే. ఇంటి దగ్గర్నించి నాలుగువొందలు సంపాయించవొచ్చు వారంలో—చెన్నపట్నం వెడితే?

మర్నాడు సాయంత్రం గదిలో షోకు చేసుకుంటో నుంచున్నా. ఈ హనుమంతరావు రోజల్లా కనపడలేదు. ఏమైనాడో! వాడితో చెప్పనా?

వాడి వేదాంతం గోలలో ఈ రసికత్వం వినపడుతుందా? దరిద్రుడు యిరవై యేళ్ళకే ఆ వేదాంత మేమిటి? పాపం యెంతకర్మం పట్టిందో! వెధవ, వాడి గోలెందుకు? వెళ్ళాలి. కిటికీకింద వుత్తరముంది;

"నా జాతకం తిరిగింది, ఉత్త సందేహాలతో నన్ను పొమ్మన్న సుందరి నన్నతాత్తుగా నీ బోధచేత అంగీకరించింది, ఈవేళ. మా యిద్దరి వందనాలు. ఇద్దరం వెళ్ళిపోతున్నాము. కాఫీహోటలు బాకీకి పైకంలేదు. నువ్విచ్చెయ్యి.

—హనుమంతరావు"

★